క్లుప్తంగా

కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీకాంత్‌గౌడ్

పటాన్‌చెరుటౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఓబీసీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలం పాట

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం బొంతపల్లిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్టు ఈఓ శశిధర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి చీరలు, స్వామివారి వస్త్రాలు, ఒడి బియ్యం సేకరించేందుకు వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు శనివారం దేవాలయ ఆవరణలో నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

అనారోగ్యంతో ఖేడ్ సబ్‌రిజిస్ట్రార్ మృతి



పవన్‌కుమార్ (ఫైల్)

నారాయణఖేడ్: నారాయణఖేడ్ సబ్ రిజిస్ట్రార్ పవన్ కుమార్(42) అనారోగ్యంతో మృతి చెందారు. మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన పవన్‌కుమార్ నారాయణఖేడ్‌కు బదిలీపై వచ్చారు. దాదాపు రెండు నెలల క్రితం అనారోగ్యం బారిన పడడంతో ఉద్యోగానికి సెలవు పెట్టి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందారు. శుక్రవారం ఆయన అంత్యక్రియలను స్వగ్రామంలో నిర్వహించగా యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు సాగర్ షెట్కార్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, తదితరులు నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జిన్నారం(పటాన్‌చెరు): వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ శ్రీకాంత్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వినోద్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

వట్‌పల్లి(అందోల్): శాంతి భద్రతల పరిరక్షణకు భంగం వాటిల్లకుండా కృషి చేస్తానని ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం వట్‌పల్లి నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు.

27న తైబజార్ వేలం

వట్‌పల్లి(అందోల్): అందోల్ జోగిపేట మున్సిపల్‌కు సంబంధించి 2023- 24 సంవత్సరానికి గానూ తైబజార్ వేలం పాట ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్ టెండర్ రుసుము రూ. 1 లక్ష, మేకలు, గొర్రెల సంతకు రూ. 1 లక్ష చొప్పున, కబేళాలకు రూ. 15 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు మున్సిపాలిటీకి ఎలాంటి బకాయి ఉండకూడదని.. మున్సిపల్ కమిషనర్ పేరిట డీడీ తీసి 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

మాడ్గి-ధనసిరి రోడ్డు మూసివేత



జహీరాబాద్ టౌన్: వర్షాలకు దెబ్బతిని ప్రమాదకరంగా మారిన మొగుడంపల్లి మండలంలోని మాడ్గి-ధనసిరి రోడ్డు మూసివేశామని తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు మాడ్గి-ధనసిరి రహదారి దెబ్బతిన్న ప్రమాదకరంగా తయారైంది. రాహదారిలోని కల్వర్టుకు గుంతపడింది. సింగిల్ రోడ్డు కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రోడ్డును పరిశీలించి న ఆర్ అండ్‌బీ డీఈఈతో మాట్లాడారు. డీఈఈ సలహామేరకు రోడ్డును మూసివేశారు. ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ కోరారు.

వానొచ్చే.. వరద తెచ్చే..

పొంగిపొర్లుతున్న చెరువులు, కుంటలు

జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు మత్తడి దుంకుతున్నాయి. చేపలు పట్టేందుకు యువకులు బారులు తీరగా.. వర్షపు నీటితో పంట చేలు చెరువులను తలపించాయి.



వట్‌పల్లి: కన్‌సాన్‌పల్లి చెరువు వద్ద చేపలు పడుతున్న గ్రామస్తులు



నారాయణఖేడ్: అలుగుపారుతున్న గంగాపూర్ చెరువు



నారాయణఖేడ్: చేపతో యువకుడు



జిన్నారం: గడ్డపోతారంలోని ఓ పరిశ్రమ ఎదుట నిలిచిన వర్షం నీరు



ఝరాసంగం: ప్యారవరం గ్రామ శివారులోని వాగు ఉధృతి



వట్‌పల్లి: కేరూర్‌లో అలుగు పారుతున్న ఊరకుంట చెరువు



కోహీర్: పంట పొలాలను ముంచెత్తిన నారింజవాగు



సదాశివపేట రూరల్: అలుగు పారుతున్న గంగాకత్వ కాలువ



కంగ్టి: ఉధృతంగా ప్రవహిస్తున్న దామర్‌గిద్ద కాకివాగు

తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలి

ఝరాసంగం(జహీరాబాద్): ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని తహసీల్దార్ రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం ఝరాసంగం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు ఓటరు జాబితా సవరణపై అధికారులు ప్రొఫెసర్ శకుంతల, ఆయేషా బేగం శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో గిర్దావర్ రామారావు, సీనియర్ అసిస్టెంట్ యాసిన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంపై ఓటర్లకు అవగాహన

కంగ్టి(నారాయణఖేడ్): ఈవీఎంలో ఓటింగ్‌పై మహిళలు, వృద్ధులకు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఇందిరా క్రాంతిపథం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మాక్ పోలింగ్‌లో మండల సమైఖ్య అధ్యక్షురాలు మహానందతో పాటు పలువురు మహిళలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీత వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పూజ కృష్ణా, రెవెన్యూ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



కంగ్టిలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

బీఎల్‌ఓలకు..

కోహీర్(జహీరాబాద్): ప్రశాంత ఎన్నికలకు తప్పులులేని ఓటర్ల జాబితా ఎంతగానో తోడ్పడుతుందని మాస్టర్ ట్రైనర్లు సురేశ్, ప్రసాద్, అనితారెడ్డి పేర్కొన్నారు. కోహీర్ ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకునేలా చూడాలి

కంది(సంగారెడ్డి): బూత్ లెవల్ అధికారులకు మండల కేంద్రమైన కందిలో శుక్రవారం శిక్షణ కల్పించారు. 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

నీట మునిగిన పంటలు

జహీరాబాద్: అధిక వర్షాలతో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో పలు పంటలు నీట మునిగాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ఆయా మండలాల్లో సాగులో ఉన్న మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, కంది, మినుము, పెసర పంటలు నీట మునిగాయి. మొగుడంపల్లి, గుడ్‌పల్లి గ్రామాల్లో పంటలు అధికంగా దెబ్బతిన్నట్లు ఆయా గ్రామాల రైతులు పేర్కొన్నారు. చెరకు పంటలో సైతం అధికంగా నీరు చేరింది.

కాలనీలు తిరిగి.. సమస్యలు తెలుసుకొని..

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలోని 33వ వార్డులో సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా వార్డులో తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్, ఇరిగేషన్ డిప్యూటీ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పాత ఇండ్లు ఖాళీ చేయాలి

సదాశివపేట(సంగారెడ్డి): శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివసిస్తున్న వారు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 23వ వార్డులో ఉన్న గృహాలను కౌన్సిలర్ ఇంద్రమోహన్‌గౌడ్‌తో కలిసి కమిషనర్ కృష్ణారెడ్డి, ఇంజినీర్ రాజేశ్ పరిశీలించారు.

చెరువు, కుంటల పరిశీలన

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరలోని చెరువు, కుంటలను శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ శారదాదేవి, ఎంపీఓ సువర్ణ, సర్పంచ్ వీరస్వామిగౌడ్, తదితరులు సాకి చెరువుతో పాటు పలు కుంటలను పరిశీలించారు.

అమీన్‌పూర్‌లో..

పటాన్‌చెరు: అమీన్‌పూర్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి శుక్రవారం పట్టణంలో అధికారులతో కలిసి పర్యటించారు. ఇసుకబావి, బీరంగూడ, నర్రెగూడెం, అమీన్‌పూర్ పాత గ్రామం ప్రాంతాల్లోని కాలనీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ జ్యోతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.



రామచంద్రాపురం: రామచంద్రారెడ్డినగర్‌లో రోడ్డుపై నిలిచిన నీటిని తొలగిస్తున్న సిబ్బంది

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాలతో పలుచోట్ల రోడ్లపై వర్షపు నీరు చేరింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించారు. పట్టణంలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలో రోడ్లపై వర్షం నీరు నిలవడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది వాటిని మళ్లించారు. తెల్లాపూర్ నుంచి నల్లగండ్లకు వెళ్లే ప్రధాన రహదారిపై నీరు నిల్వడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

పెద్ద చెరువు సందర్శన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ పెద్ద చెరువును శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ సంతోషని సందర్శించారు. చెరువు కట్టను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సంజయ్‌లు పాల్గొన్నారు.

ముసురుతో కూలుతున్న ఇళ్లు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని పలు గ్రామాల్లో వర్షం ధాటికి ఇళ్లు కులుతున్నాయి. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి నివాస గృహాలు కూలడంతో పలువురు నిరాశ్రయులయ్యారు. సర్దార్‌తండా, బాన్సువాడ, తడ్కల్, జమ్గి, చాప్టాలో ఇళ్లు కూలడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల నిరసన

కొండాపూర్(సంగారెడ్డి): మణిపూర్ సీఎం వెంటనే రాజీనామా చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సంగారెడ్డిలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు



కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్, అధికారులు

పటాన్‌చెరు టౌన్: ఎడతెగని వర్షాలతో ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో భారీగా వరద నీరు వచ్చి చేరడంతో కాలనీ మొత్తం జలమయంగా మారింది. సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, ఇతర అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటించారు. వరద నీరు బయటికి వెళ్లేలా కాలువ (ట్రెంచ్) చేసి వరద నీటిని చిన్నవాగులోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని రోడ్లపై మ్యాన్ హోల్స్‌ను గమనించాలని కోరారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. ఎంబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాను ఫౌండేషన్ చైర్మన్ రోషన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు డ్రైవింగ్ లేకున్నా వాహనాలు నడుపున్నారని.. తనిఖీల్లో పట్టుబడితే జరిమానా చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. అనంతరం రోషన్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతీ, యువకులు ఈనెల 31 వరకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు అంజాగౌడ్, సత్యపాల్‌రెడ్డి, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తును స్వీకరిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ అర్హులందరికీ 'దళిత బంధు' ఇవ్వాలి

పటాన్‌చెరు టౌన్: అర్హులందరికీ దళిత బంధు ఇవ్వాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో దళితులను ఆకర్షించేందుకు సీఎం కేసీఆర్ కొన్నిచోట్ల మాత్రమే ప్రవేశపెట్టారని విమర్శించారు.

◆ 28న ఉచిత మెగా వైద్య శిబిరం

నారాయణఖేడ్: మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని శివాలయం వద్ద ఈనెల 28న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో చలి జ్వరం, కేన్సర్, స్త్రీ సంబంధిత, గుండె, ఎముకల సంబంధిత వ్యాధుల వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

◆ పొంగిన దబ్బవాగు

మునిపల్లి(అందోల్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తాటిపల్లి దబ్బవాగు పొంగి పొర్లుతుంది. శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు చూడడానికి బారులు తీరారు. వరదకు పత్తి పంట దెబ్బతినగా.. వ్యవసాయ భూముల్లో ఎక్కడికక్కడ గండ్లు పడ్డాయని రైతులు తెలిపారు.

◆ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి కార్యకర్తలతో కలసి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, దేవేందర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, పూర్ణిమ, గీతల పాల్గొన్నారు.

◆ నిధుల మంజూరుపై హర్షం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 30 కోట్లు మంజూరు చేయడంపై మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్ గుప్త హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు 1, ఇంగ్లీష్ 2, కామర్స్ 2, హిస్టరీ 1, జువాలజీ 1, కంప్యూటర్ సైన్స్/ అప్లికేషన్ 1 విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు నేరుగా సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకుని, అదేరోజు ముఖాముఖికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 7673967514 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

◆ బాధితులను ఆదుకుంటాం

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరలో పలువురి ఇండ్లు కూలిపోగా.. సర్పంచ్ వీరస్వామి గౌడ్, వార్డు సభ్యులు బాధితులను ఓదార్చారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సహకారంతో అధికారులు దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

◆ ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ఏర్పాటు

జహీరాబాద్ టౌన్: సీజనల్ వ్యాధులను అరికట్టానికి ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామని కోహీర్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఎపిడిమిక్ సెల్ అధికారి డాక్టర్ శంకర్ తెలిపారు. భారీ వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కోహీర్ డివిజన్ పరిధిలోని 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల పర్యవేక్షణలో టీమ్స్ పనిచేస్తాయన్నారు.

◆ ఖేడ్‌లో ఖర్గే జన్మదిన వేడుకలు

నారాయణఖేడ్: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, వినోద్‌పాటిల్, పండరిరెడ్డి, ఏసులు, నారాయణజాదవ్, తదితరులు పాల్గొన్నారు.

◆ జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రమైన ఝరాసంగం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో జీపీ కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తగిన వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

◆ ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసిన ఎస్‌ఐలు



జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని పలు పోలీస్‌స్టేషన్‌లకు బదిలీపై వచ్చిన కొత్త ఎస్‌ఐలు శుక్రవారం ఎమ్మెల్యే మాణిక్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ ప్రసాద్, హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు, చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ క్యాంపు కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యేను కలిశారు.

నిండని మేళ్ల చెరువు..

అలుగుపారుతున్న వనం చెరువు



తెల్లాపూర్‌లో పూర్తిగా నిండని మేళ్ల చెరువు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గత రెండు, మూడు రోజులుగా వర్షాలు పడుతున్నప్పటికీ చెరువులు మాత్రం నిండడం లేదు. దీనిని బట్టి చూస్తే వరద కాలువలు ఏమేరకు కబ్జాకు గురయ్యాయో అర్థం చేసుకోవచ్చు. తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువులోకి పెద్దగా నీరు చేరలేదు. తెల్లాపూర్‌లోని వనం చెరువు మాత్రం మురుగు నీటితో అలుగు పారుతుంది. కొంతకాలంగా వనం చెరువులోకి మురుగు నీరు చేరుతుందని అధికారులకు స్థానికులు మొరపెట్టుకున్నారు. ప్రధానంగా వరద కాలువలు పలుచోట్ల కబ్జాకు గురికావడంతో చెరువులోకి వర్షపు నీరు రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరద కాలువలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.